వైభవంగా సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, అర్చకులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గీతం వర్సిటీకి ఎన్‌ఎంసీహెచ్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సీతమ్మధార : స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్) ప్లస్‌లో చదువుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఇద్దరు గీతం యూనివర్సిటీకి ఎంపికయ్యారు. గీతం వర్సిటీ ప్రొఫెసర్ నరేష్ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినులు కందూరి ప్రసన్న, పట్నాల విజయలక్ష్మి అర్హత సాధించి ఉచిత సీటు సాధించారు. వీరిద్దరూ ఇదే పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. వీరికి గీతం యూనివర్సిటీలో ఉచిత విద్యతో పాటు, ఉచిత హాస్టల్ సదుపాయం కూడా కల్పించారని ఉపాధ్యాయులు తెలిపారు. గతంలో కూడా ఇదే పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు గీతం యూనివర్సిటీకి ఎంపికయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.ప్రియదర్శిని, జి.వరలక్ష్మి, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

మురళీనగర్ : వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సహకారంతో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శనివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ స్వాతి, ఇతర వైద్య బృందం సుమారు 60 మందికి పరీక్షలు చేశారు. దంత సమస్యలు, పరిష్కారంపై అవగాహన కల్పించారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, యు.శుభ, సనపల వరప్రసాద్, వి.ప్రమీల, పి.మహాలక్ష్మి, ఆర్.సుదిత, ఎం.జయ, ఎం.ప్రమీల రావు, కె.భానుమతి, ఎస్.రత్నకుమారి, శిరీష లత పాల్గొన్నారు.

ముచ్చటగా మూడే బస్సులు

- సీతమ్మధార ప్రజల రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని మద్దిలపాలెం ఆర్టీసీ డిపో అధికారులు



ఆరిలోవ నుంచి రైల్వేస్టేషన్‌కు సీతమ్మధార మీదుగా వెళ్లే 69వ నంబరు సిటీ బస్సు

సీతమ్మధార : సీతమ్మధార, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల రాకపోకలకు సరిపడా సిటీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా ఒక్కో సిటీ సర్వీసును ఆర్టీసీ అధికారులు రద్దు చేస్తుండడంతోపాటు ఉన్న సర్వీసుల్లో కోత విధిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం హెచ్‌బీ కాలనీ – పాత పోస్టాఫీసు బస్సు సర్వీసు 20ఏ రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందే పాత పోస్టాఫీసు నుంచి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ వరకు రాకపోకలు సాగించే 20 నంబర్ సిటీ బస్సులు కూడా రద్దు చేసేశారు. దీంతో ప్రస్తుతం ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కేవలం 69 నంబరు బస్ సర్వీసు మాత్రమే మిగిలింది. ఆరిలోవ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఈ బస్సు హెచ్‌బీకాలనీ, ఎంఎంటీసీ కాలనీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, గురుద్వారా, సీతంపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంది. గతంలో హెచ్‌బీ కాలనీ నుంచి సింహాచలం వెళ్లే సిటీబస్సులు కూడా రద్దు చేసేశారు. ప్రస్తుతం సీతమ్మధార ప్రాంతాల ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా 69వ నంబరు సిటీ బస్సు సర్వీసులనే ఆశ్రయించాలన్నట్లుగా పరిస్థితి మారిపోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. గతంలో 69 నంబర్ సర్వీసుతో ఆరు సిటీ బస్సులు నడిపేవారు. వాటినీ కుదించేసి ప్రస్తుతం మూడు బస్సులే నడుపుతున్నారు.

బస్సుల్లేక ఆటోల్లోనే రాకపోకలు

సీతమ్మధార చుట్టుపక్కల ప్రాంతాల్లోని దుకాణాలు, ఇళ్లలో పనిచేసే పేద మహిళలు 69వ నంబరు సిటీ బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ ప్రాంతాల్లో గల జీవీఎంసీ, పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు గతంలో సిటీ బస్సుల్లో రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం బస్సుల సంఖ్యలో కోత పెట్టడంతో వారంతా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు ఉన్నవి మూడే సర్వీసులు కావడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియని అయోమయ దుస్థితి నెలకొంది. పైగా రైల్వే స్టేషన్ నుంచి మద్దిలపాలెం డిపోకి వెళ్లేటప్పుడు వయా గురుద్వారా బదులుగా రేసపువానిపాలెం మీదుగా వెళ్లిపోవడంతో మధ్యాహ్న భోజన విరామ సమయంలో బస్సులు ఉండడం లేదని సీతంపేట, గురుద్వారా ప్రాంతాల ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కాలక్రమంలో సీతమ్మధార, పరిసర ప్రాంతాలకు చెందిన సిటీ బస్సులన్నీ ఒక్కొక్కటిగా రద్దు చేసేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మద్దిలపాలెం డిపో అధికారులు స్పందించి 69వ నంబర్ సర్వీసుల సంఖ్యను పెంచాలని స్థానిక ప్రజలు, చిరువ్యాపారులు కోరుతున్నారు.

ఎట్టకేలకు చెట్ల కొమ్మల తరలింపు

సాక్షి ఎఫెక్ట్..



చెట్ల కొమ్మలు తరలించి శుభ్రం చేసిన తర్వాత శాంతిపురం రహదారి

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలో విద్యుత్ శాఖ తొలగించి వదిలేసిన చెట్ల కొమ్మలు ఎట్టకేలకు తరలించారు. శాంతిపురం ప్రధాన రహదారితోపాటు, అనుబంధ రహదారుల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించారు. ఐదు రోజులు గడిచినా తరలించకుండా కుప్పలుగా వదిలేయడంతో స్థానికుల ఇబ్బందులపై 'విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు' శీర్షికతో సాక్షిలో 22న ప్రచురించిన వార్తకు జోన్ – 3 అధికారులు స్పందించారు. శానిటేషన్ సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగింపజేసి, రహదారులు శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూజీడీ మట్టిదిబ్బలు తరలిస్తాం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో పేరుకుపోయిన మట్టిదిబ్బలు తరలించడానికి అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఇక్కడి మట్టి కుప్పలు కారణంగా రోడ్డు అధ్వానంగా తయారవడంతోపాటు ప్రయాణికుల ఇబ్బందులపై ఈ నెల 24న 'యూజీడీ కోసం తవ్వి వదిలేశారు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి మట్టి దిబ్బలు తరలిస్తామని 24వ వార్డు మంచినీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ రహీమ్ తెలిపారు. వర్షాల కారణంగానే మట్టి తరలింపు ఆలస్యమైందని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



జీవీఎంసీ 26వ వార్డు 80 అడుగుల రోడ్‌లో నిర్మిస్తున్న ఇంటి స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్ క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 అడుగుల రోడ్‌లో గెడ్డ పోరంబోకును ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్న స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారించి రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 1994లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబరు 40లో 122 గజాల స్థలం ఇచ్చిందని పిన్నింటి పోలమ్మ కుటుంబ సభ్యులు గెడ్డ పక్కన ఇల్లు నిర్మిస్తున్నారు. అయితే వారు ఇల్లు నిర్మిస్తున్న స్థలం సర్వే నంబరు 40లోకి రాదని గౌషియా బేగం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై 'దర్జాగా గెడ్డల ఆక్రమణ' శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు స్పందించారు. జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధు ఇంటి నిర్మాణ పనులను నిలిపేయాలని ఇంటి యజమానికి వర్క్ స్టాప్ ఆర్డర్ జారీ చేసిన విషయం తెలిసిందే. రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించి, ఇల్లు నిర్మిస్తున్న స్థలం సర్వే నంబరు 40లోకి రాదని, ఇది ప్రభుత్వ స్థలమని నిర్ధారించారు. వెంటనే ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ కలెక్టర్ పేరిట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

పోర్టు యాజమాన్యమే ఆస్పత్రి నిర్వహించాలి



చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరాయి. సీఐటీయూ నాయకులు చెవిలో పువ్వులతో శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ త్రినాథ రావు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత ఉండదన్నారు. కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న విశాఖపట్నం పోర్టు సొంత నిధులతోనే ఆస్పత్రిని నిర్వహించాలని, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రైవేటీకరణ ద్వారా లబ్ధి పొందేది ప్రైవేటు వ్యక్తులు మాత్రమేనని, కార్మికులు మాత్రం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి భానుమూర్తి, కూన వెంకటరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సత్యారావు మద్దతు తెలిపారు. రాఘువులు, నాయుడు, లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా దీపావళి అలంకరణ సామగ్రి విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా అలంకరణ సామగ్రి

సీతమ్మధార: దీపావళి నేపథ్యంలో పలు ప్రాంతాల్లో అలంకరణ సామగ్రి పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. ఈ మేరకు డైమండ్ పార్కు, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో దీపావళి పండగకు ఇంట్లో అలంకరణకు వినియోగించే పలు రకాల సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. ఇంటి గేట్లు, ప్రధాన ద్వారం వద్ద అలంకరణకు వినియోగించే గంటలు, చక్రాలు, వివిధ కళాకృతులు, తోరణాలు, టోపీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : సేవాభావంతోపాటు మానవత్వ విలువలు పెంపొందించే వారే స్కౌట్స్ అండ్ గైడ్స్ అని వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్, వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ చైర్మన్ సౌరబ్ ప్రసాద్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, మానవత్వం, సహనగుణం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. వాల్తేర్ కేవీ ప్రిన్సిపాల్ కమల్ జీత్ మాట్లాడుతూ మూడు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. 25 స్కూళ్ల నుంచి 178 మంది విద్యార్థినీ, విద్యార్థులు(స్కౌట్స్ అండ్ గైడ్స్), 25 మంది ఎస్కార్ట్ టీచర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. వీరందరికీ పలు అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విజయవాడ కేవీకి చెందిన రమేష్ బాబు లీడర్ ఆఫ్ క్యాంప్‌గా, జగన్‌మోహన్‌రావు అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విజయలక్ష్మి, సబ్రిన్, పూజ, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సీతమ్మధార : గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 13న రైల్వేస్టేషన్ దరి బస్టాప్ వద్ద సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా పోలీసులు కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసుల దర్యాప్తులో మృతుని పేరు శివ అని తెలిసిందని, సంబంధీకులు సంప్రదించాలని కోరారు.

కూడలి రోడ్డు దాటాలంటే హడల్



కంచరపాలెం జాతీయ రహదారి నుంచి కప్పరాడకు రోడ్డు దాటుతున్న పాదచారులు



సబ్‌వే రహదారిలో ట్రాఫిక్‌కు అడ్డంగా ఇష్టారాజ్యంగా నిలిపిన ఆటోలు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం జాతీయ రహదారి నుంచి జీవీఎంసీ 46, 47, 48వ వార్డుల్లోని కప్పరాడ కొండవాలుకి జాతీయ రహదారి, సబ్‌వే మార్గం దాటి ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం బీఆర్‌టీఎస్ మార్గానికి వెళ్లాలంటే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు హడలిపోతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయకపోవడం, పోలీస్ సిబ్బంది జాడ లేకపోవడంతో ఇటీవల ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయి. పిల్లలను పాఠశాలలకు పంపాలంటే భయాందోళనగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్మార్ట్‌మీటర్ల పనులు వేగవంతం చేయాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో ఈపీడీసీఎల్ ఇంజినీర్లు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో స్మార్ట్‌మీటర్ల బిగింపు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కోరారు. ఈ మేరకు ఈపీడీసీఎల్‌లో ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇంజినీర్లు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుతుందన్నారు. ప్రీ – పెయిడ్ విధానంలో బిల్లు చెల్లించే సదుపాయం కూడా అందుబాటులోకి వస్తుందని గుర్తు చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఇంజినీర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు, కంచరపాలెం సెక్షన్ ఏడీఈ సత్యనారాయణ, మురళీనగర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజేష్ పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకు విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: కంచరపాలెం పాత ఐటీఐలో నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో జాతీయ ర్యాంకు సాధించిన విద్యార్థులను ఎంపీ శ్రీభరత్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ర్యాంకర్లకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.జయలక్ష్మి, పి.శ్యామల దీపిక, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు ఆడిటోరియానికి ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందిస్తున్న రంగారావు, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ మహిళలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈస్టు పార్కులోని ఆడిటోరియానికి ఫ్యాన్లు శనివారం అందజేశారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో 8 ఫ్యాన్లను వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ టి.రంగారావు, ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పార్కు అధ్యక్ష, కార్యదర్శులు బి.మురళీకృష్ణ, ఇ.ప్రసాద్, క్లబ్ పూర్వ అధ్యక్షులు కె.మాధవి, ఎం.శేషామణి, డి.శిరీష, ఉపాధ్యక్షురాలు టి.లీలానాయుడు, డైరెక్టర్స్ పి.లక్ష్మి, కె.సుగుణ పాల్గొన్నారు.